# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం నిధులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విడుదల చేయనున్నారు.**

2. **భూ హక్కుల పరిరక్షణలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**

3. **అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

4. **కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఏడు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో మూడు తెలంగాణకు కేటాయించిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తొలి విడతగా సుమారు 3వేల 125 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుందని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిధులను విడుదల చేయనున్నారని చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 46 లక్షల 85 వేల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని, అర్హులైన ఒక్కో రైతు కుటుంబ ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5 వేలు, కేంద్ర ప్రభుత్వం నుంచి 2 వేలు, చొప్పున మొత్తం 7వేల రూపాయలు జమ కానున్నాయని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తారని, అనంతరం రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, ప్రజావేదిక సభలో ప్రసంగించనున్నట్లు తెలిపారు.

------------------------

అమరావతిలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా, ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఆర్డీఏ అథారిటీ సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్, ఇంటర్నెట్, కేబుల్ కనెక్టివిటీ సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీపీపీ విధానంలో డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రణాళికలు

రూపొందించాలన్నారు. అమరావతిలో బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో వివిధ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణాలకు అవసరమైన అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు.

---------------------------

భూ హక్కుల పరిరక్షణలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గత రెండేళ్లలో భూ పరిపాలనను ఆధునీకరించి ప్రజల ఆస్తులకు సంపూర్ణ భద్రత కల్పించేలా విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 4 వేల ఎకరాలకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని తెలిపారు. రీ–సర్వే ప్రక్రియలో ప్రజల అభ్యంతరాల పరిష్కారానికి గ్రామస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో నిన్న నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం" విజయోత్సవ సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా లక్షా 5 వేల మంది మంది డ్వాక్రా మహిళలకు 195 కోట్ల రూపాయల రుణాలు, పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ద్వారా వెయ్యి 837 మంది మహిళలకు 34 కోట్ల రూపాయల రుణాలను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఏడు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో మూడు తెలంగాణకు కేటాయించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో 87 కోట్ల రూపాయల కేంద్ర నిధులతో చేపట్టిన, వివిధ రోడ్ల పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన నిన్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారుల అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో స్వచ్ఛత, కాలుష్య నియంత్రణ, సర్క్యులర్ ఎకానమీ లక్ష్యాల సాధనకు చర్యలు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై నిన్న నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 11వేల 4 వందల స్టవ్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో 33 మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు ప్రారంభమయ్యాయని, మరో 148 ప్లాంట్ల పనులు త్వరలో

ప్రారంభమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. స్వచ్ఛాంధ్ర పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

మాదక ద్రవ్యాల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు పాల్గొన్నారు. 'డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, తాము మాత్రమే కాకుండా ఇతరులు కూడా మాదక ద్రవ్యాల బారిన పడకుండా కృషి చేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములమవుతామని' విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

---------------------------

యోగాంధ్ర కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కోటి 4 లక్షల రిజిస్ట్రేషన్ల లక్ష్యాన్ని అధిగమిస్తూ నిన్న సాయంత్రానికి కోటి 6 లక్షల మందికిపైగా యోగాంధ్ర పోర్టల్‌లో తన వివరాలు నమోదు చేసుకున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో 100 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు నమోదు చేసినట్లు తెలిపారు. రేపు నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో భారీ స్థాయిలో ప్రజల భాగస్వామ్యం ఉండనుందని పేర్కొన్నారు. అత్యధికంగా 112.96 శాతం రిజిస్ట్రేషన్లు సాధించి మార్కాపురం జిల్లా తొలి స్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు.

---------------------------

తూర్పు విదర్భ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి జి. లక్ష్మి తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని పేర్కొంటూ..

వాయిస్…27 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

=====================